భళా.. బాల మేధావి!

మేధస్సుకు పదును పెట్టిన విద్యార్థులు

- ప్రకృతిపై పరిశోధన చేసి ప్రాజెక్టుల తయారీ
- నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శన
- ఆకట్టుకున్న చిన్నారుల ప్రాజెక్టులు


ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, నిశితంగా ప్రకృతి పరిశీలన, పర్యావరణాన్ని పరిరక్షించుట, బాల శాస్త్రవేత్తలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం వంటి ఉన్నత లక్ష్యంతో ఏటా నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సైన్స్ పోటీల్లో భాగంగా విద్యార్థులు వారి భావి మేధస్సుకు పదును పెట్టి సమాజానికి ఉపయోగపడే అద్భుతమైన ప్రాజెక్టులు చేసి భవిష్యత్ శాస్త్రజ్ఞులుగా తయారయ్యేందుకు సిద్ధమవుతున్నారు. సోమవారం కరీంనగర్‌లోని సాయి మానేరు పాఠశాలలో నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ 2023 పోటీలు జరిగాయి. పోటీల్లో భాగంగా విద్యార్థులు 93 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈసందర్భంగా పలువురిని 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

ప్రకృతిని కాపాడడంపై..



ప్రస్తుత కాలంలో ప్రకృతిని ఎలా కాపాడుకోవాలో చాలా మందికి తెలియదు. ఏ కాలంలో ఏ విధంగా మన నేచర్‌ను కాపాడుకోవాలో ప్రాజెక్టు ద్వారా చేసి చూపించాం. మా చుట్టు పక్కల ఉండే వారి ఇంట్లో వారిని పరిశీలించాం. వారితో మాట్లాడి ప్రకృతిపై వారికి ఎంత అవగాహన ఉందో తెలుసుకుని ఈ ప్రదర్శన చేశాం. – పల్లవి, రోషిణి, జీహెచ్‌ఎస్ గంజ్, కరీంనగర్

పిల్లల ఫుడ్‌పై ప్రదర్శన



2–8 ఏళ్ల మధ్య ఉండే పిల్లలు తీసుకునే ఫుడ్‌పై ప్రదర్శన చేశాం. ప్రస్తుతం ఈ వయస్సు వారు కొందరిలో ఎదుగుదల తొందరగా జరుగుతుంటే మరి కొందరిలో మందకొడిగా జరుగుతుండడం గమనించాం. నిజానికి 2–8 ఏళ్ల మధ్య ఉండే పిల్లలు ఎలాంటి ఫుడ్ తీసుకుంటే బాగుంటది దానిపై ప్రదర్శనలో చూపించాం. – సరిత, శ్రీనిధి, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు) చొప్పదండి

మొబైల్స్‌తో కలిగే నష్టాలు



నిత్య జీవన విధానంలో మొబైల్ ఒక భాగమైంది. మొబైల్ లేకుండా ఉండే పరిస్థితి లేదు. మేము మొబైల్ వల్ల కలిగి నష్టాలను తెలుసుకున్నాం. ప్రత్యక్షంగా చూడాలని ఒక పది మంది ద్వారా సర్వే చేశాం. మేము తెలుసున్న వాటిలో సగం ఆ పది మందిలో ఉండడం గమనించాం. మొబైల్‌తో కలిగే నష్టాలను ప్రదర్శన చేసి చూపించాం. – నక్షత్ర, శివాని, కేజీబీవీ, తిమ్మాపూర్

తేలి ఆడే ఇళ్లు



వర్షాలు, వరదలు, సునామీల వల్ల తీర ప్రాంతాల్లోని ఇళ్లకు ఇళ్లు కూలి పోవడం చూస్తున్నాం. ఆస్తి నష్టం కూడా జరుగుతోంది. ఇటీవల కూడా వరదలతో చాలా నష్టం జరిగింది. ప్లాస్టిక్ రాడ్స్‌తో పిల్లర్లు నిర్మించి ఒక ఇంటిని నిర్మించాం. వరదలు వచ్చినప్పుడు ఇల్లు కూలిపోకుండా నీటిలో తేలియాడే విధంగా ప్రదర్శన ద్వారా చూపించాం. – గంగోత్రి, సంజన, కేజీబీవీ, మానకొండూర్

ప్రకృతి ఆధారంగా ప్రదర్శనలు



ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం ప్రధాన అంశంగా ఎంచుకున్నారు. పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సును పెంపొందించడం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, స్వీయ ఆధారితం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణ లాంటి ఉప అంశాల్లో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు.

– చాడ జయపాల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, కరీంనగర్

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి



జిల్లాస్థాయి ప్రదర్శనలో సుమారు 97 ప్రదర్శనలు వచ్చాయి. ఉత్తమమైన నాలుగు ప్రదర్శనలతో పాటు స్పెషల్ కేటగిరి కింద మరో ప్రదర్శనను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తాం. వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రదర్శన ఇచ్చి జాతీయ ప్రదర్శనలకు ఎంపిక కావాలి.

– కేఎస్ అనంతాచార్య, ఎన్‌సీఎస్‌సీ, కోఆర్డినేటర్

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


వివరాలు తెలుసుకుంటున్న సీపీ అభిషేక్ మహంతి

- ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులపై నిఘా ఉంచండి
- సీపీ అభిషేక్ మహంతి
- కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ

కొత్తపల్లి(కరీంనగర్): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సీపీ అభిషేక్ మహంతి హెచ్చరించారు. ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని కొత్తపల్లి ఠాణాను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత ఎన్నికల సమయంలో గొడవలు చేయడంతోపాటు అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినవారు, ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా, జైలుశిక్ష విధిస్తారన్న విషయాన్ని తెలపాలన్నారు. కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, ఎస్‌ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి ఉద్యమ నాయకుడు


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న చైతన్య

సప్తగిరికాలనీ: ఉద్యమ నాయకుడు, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ (ఫౌండర్) చైర్మన్ చెన్నమల్ల చైతన్య సోమవారం తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. చైతన్యకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే ఓయూ జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్ సమక్షంలో విద్యార్థి సంఘాల నాయకులు, శాతవాహన యూనివర్సిటీ నాయకలు శనిగరం అరుణ్‌కుమార్, గడ్డమీద రాజశేఖర్, గడ్డమీది రాకేశ్, ముల్కల విజయ్, సూర రాముయాదవ్, నంగునూరు చంద్రశేఖర్, బసవరాజు అభిలాష్, బండ అశోక్ తదితరులు చేరారు.

క్లుప్తంగా

ఆదాయపు పన్ను చెల్లింపుపై అవగాహన


సంధ్యారాణిని సన్మానిస్తున్న సిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జీతం పొందిన వ్యక్తులు ఆదాయపు పన్ను రిటర్న్స్, ఫైలింగ్‌పై అంతర్జాల జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.సంధ్యారాణి హాజరై ఆదాయపు పన్ను చెల్లించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, సమావేశకర్త సుహాసిని, ఉమాదేవి, రాధిక, ఏసీవో సుష్మ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో శ్రీలత

కరీంనగర్‌రూరల్: ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని డీఆర్‌డీవో శ్రీలత సూచించారు. సోమవారం కరీంనగర్ మండలం ఎలబోతారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్యాడీక్లీనర్ ద్వారా శుభ్రపరిచిన ధాన్యం మాత్రమే కాంటా వేయాలని ఆదేశించారు. ఏఈవోలు ధాన్యం పరిశీలించి సర్టిపై చేయాలని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం చామనపల్లి, బహదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లోని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతం తనిఖీ చేసి కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్, ఏపీఎంలు భార్గవ్, రాజేశం, సీసీ కనుకయ్య, వీవోఏ రజిత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో నగునూరు, జూబ్లీనగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో రమేశ్ ప్రారంభించారు.

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్‌కు విష్ణువర్ధన్


విష్ణువర్ధన్

కరీంనగర్‌స్పోర్ట్స్: తమిళనాడులోని కోయంబత్తూర్‌లో మంగళవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరుగనున్న 38వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌కు చెందిన ఎడ్ల విష్ణువర్ధన్ ఎంపికైనట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవిలు తెలిపారు. ఇటీవల హనుమకొండలో జరిగిన సౌత్ ఇండియా పోటీల్లో 10 కిలోమీటర్ల వాకింగ్ ఈవెంట్‌లో పాల్గొని సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజవీరు, సీనియర్ క్రీడాకారులు హరికిషన్, రమేశ్, రాజగోపాలచారి, కనకం సమ్మయ్య, సుమన్, కల్యాణ్ తదితరులు అభినందించారు.

బీకేఎంయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా సృజన్ కుమార్


సృజన్‌కుమార్

సప్తగిరికాలనీ(కరీంనగర్): బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు జరిగిన భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) 15వ జాతీయ మహాసభల్లో కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్‌ను జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్ తెలిపారు. సృజన్‌కుమార్ ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షులు అందెస్వామి, దరిపెల్లి అంసూస్, సహాయ కార్యదర్శులు విలాసాగరం అంజయ్య, బత్తుల బాబు, నాయకులు కూన రవి, ఎగుర్ల మల్లేశం, అందె వెంకన్న తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'చింతకుంటలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి'

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట పంచాయతీ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన 439 సర్వేనంబర్‌లోని భూమిని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను ఆపాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు భీమ ఆర్మీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపల్లి చంద్రయ్య, నాయకులు రాజు, రాంమూర్తి, శంకర్, శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన పదెకరాల స్థలంలో రేకుల షెడ్డు నిర్మాణం చేసిన వ్యక్తులపై చట్టపరంగా తీసుకోవడంతో పాటు పాఠశాల స్థలాన్ని కాపాడాలంటూ కోరారు.

ప్రాథమిక విద్యలో గుణాత్మక మార్పు తీసుకురావాలి



కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

కరీంనగర్‌సిటీ: ప్రాథమిక స్థాయి విద్యలో గుణాత్మకమైన మార్పులు అవసరమని ఎస్సారార్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.రామకృష్ణ పేర్కొన్నారు. గుణాత్మక మార్పు తీసుకురావడానికి చేపట్టిన 'పిల్లల కోసం' కార్యక్రమానికి సంబంధించి ఒకరోజు శిక్షణ వర్క్‌షాప్‌ను సోమవారం ఎస్సారార్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ చేపట్టిన 'తొలిమెట్టు' కార్యక్రమానికి అనుబంధంగా ఈ కార్యక్రమం జాతీయ సేవ పథకం వలంటీర్లతో పని చేస్తుంది. ఇందులో భాగంగా కళాశాలలో డిగ్రీ చదువుతున్న వలంటీర్లు వారికి దగ్గరలోని ఒక ప్రాథమిక పాఠశాలలో సరిగ్గా చదవడం, రాయడం రాని 15 మంది విద్యార్థులను దత్తత తీసుకుని స్నేహపూర్వకమైన బోధన చేపడుతారు. మూడు, నాలుగు, ఐదో తరగతి విద్యార్థులకు ప్రతి శనివారం ఉదయం పూట వారికి ఏర్పాటు చేయబడిన ప్రాథమిక విద్యాలయంలో ఆటపాటలతో బోధన చేస్తారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వి.వరప్రసాద్, డి.డి.నాయుడు, బి.సురేశ్ కుమార్, బి.చంద్రమౌళి, డా.బి.శారద తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సీఎం కృషి


మాట్లాడుతున్న రామారావు

కరీంనగర్: సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు పాటుపడుతున్న సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని రైతు, ప్రజాసంఘాల జాతీయ నాయకుడు పోలాడి రామారావు పిలుపునిచ్చారు. సోమవారం సంఘ కార్యాలయంలో మాట్లాడారు. రుణమాఫీ, రైతులకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, రైతుబంధు, గృహలక్ష్మి, ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన ఆహారం అందించడం, ఉదయం అల్పాహారం, హరితహారం, కేసీఆర్ కిట్, మత్స్యకారులకు ఉచిత చేపల పంపిణీ, యాదవులకు గొర్రెల పంపిణీ, కంటి వెలుగు పథకం లాంటి వినూత్న కార్యక్రమాలతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందని, ఇది తెలంగాణ పౌరులందరికీ గర్వకారణమని కొనియాడారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాచారం

8న జాబ్ మేళా

కరీంనగర్ సిటీ: నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో ఈనెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ సీహెచ్.మారుతి తెలిపారు. తెలంగాణ స్కిల్స్–నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీ యాక్సిస్ బ్యాంక్ పాల్గొంటుందని అన్నారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో డిగ్రీ పాసైన వారు అర్హులని, అభ్యర్థులు తమ బయోడెటా, పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, ఏదైన గుర్తింపు కార్డు తీసుకొని రావాలని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్సారార్ కళాశాల టీఎస్‌కేసీ సెంటర్‌లో సంప్రదించాలని అన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో డీటీఆర్ అభివృద్ధి పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ మహాశక్తి ఆలయం ఫీడర్ పరిధిలోని విద్యానగర్, సంతోష్‌నగర్, బాలాజీ సూపర్ మార్కెట్, సెయింట్ జాన్స్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెలుగుల దీపావళికి వేళాయె..



విభిన్న ఆకృతుల్లో ప్రమిదలు

- సంప్రదాయం ఉట్టి పడే ఆకారాలు
- నగరంలో జోరందుకున్న ప్రమిదల అమ్మకాలు


ప్రమిదలు విక్రయిస్తున్న వీధి వ్యాపారి

విద్యానగర్(కరీంనగర్): హిందువుల సంప్రదాయపండుగ దీపావళి వచ్చేసింది. దీపావళి పండుగ అంటేనే దీపాలంకరణతో ప్రతి ఇల్లూ కళకళలాడాల్సిందే. చీకటికి వెలుగులు తెచ్చే పండుగగా.. విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటారు. దీపం వెలుగు శోభనే కాదు స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింజేస్తుంది. ఏ ఇంటిలో దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీమహాలక్ష్మీ ప్రవేశిస్తుందని ఋగ్వేదం చెబుతోంది. దీపావళి రెండు రోజులు గృహాలు, వాణిజ్య వ్యాపార సముదాయాల్లో దీపాలు ఏర్పాటు చేసి లక్ష్మీదేవికి పూజలు నిర్వహించి సాదరంగా ఆహ్వానం పలుకుతారు.

వివిధ ఆకృతుల్లో అందమైన ప్రమిదలు

దీపావళి రోజున ముంగిళ్లలో అందమైన జ్యోతుల తోరణాలు వెలిగించేందుకు వివిధ ఆకృతుల్లో ప్రమిదలు లభిస్తున్నాయి. నాటి కాలం కుమ్మరి మట్టి ప్రమిదలతో పాటు రాజస్తాన్ నుంచి వచ్చిన వివిధ ఆకారాల్లోని దీపాలు, ఇన్‌స్టంట్ క్యాండిల్ ప్రమిదలు, ప్రమిదలపై దేవతా మూర్తుల విగ్రహాలతో విక్రయిస్తున్నారు.

నగరంలో జోరుగా విక్రయాలు

కరీంనగర్‌లోని డెయిలీ మార్కెట్, వీక్లీ మార్కెట్, మార్కెట్‌రోడ్ వేంకటేశ్వర ఆలయం ప్రాంతం, పూజా సెంటర్లతో పాటు ప్రధాన రహదారులకు ఇరువైపులా ప్రమిదల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

దీపకాంతులే ప్రత్యేకత



దీపావళి పండుగ ప్రత్యేకత లక్ష్మీపూజలు. చీకట్లను పారద్రోలే దీపాకంతులు. ప్రస్తుతం మార్కెట్‌లో వివిధ డిజైన్లు, ఆకృతుల్లో మట్టి ప్రమిదలు లభిస్తున్నాయి. చూడగానే ఆకట్టుకునే అకృతుల్లో ఉన్నా ధరలు కాస్తా ఎక్కువగా ఉన్నాయి.

– వడాల మాధవి, దీపాల కొనుగోలుదారు, కరీంనగర్

సౌభాగ్యానికి ప్రతీక



దీపం సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీక. ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నుంచి కార్తీక మాసమంతా సంధ్యా సమయంలో మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తారు. ఈ దీపాలను ముత్తయిదువులు కార్తీక పౌర్ణమి రోజున సముద్ర స్నానాలు ఆచరించి జీవనదులలో వదులుతారు.

– వాసాల స్నేహ, వినాయక మార్కెట్, కరీంనగర్

వెరైటీ దీపాలు వచ్చాయి



దీపావళి పండుగ కోసం వివిధ రకాల కొత్త వెరైటీల్లో దీపాలు వచ్చాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పుడిప్పుడే అమ్మకాలు పెరుగుతున్నాయి. వ్యాపారం బాగానే ఉంది. రోజూ రూ.500ల వరకు గిట్టుబాటు అవుతుంది.

– ఆశ, ప్రమిదల అమ్మకందారు, డైలీ మార్కెట్

ఎలగందుల మోడల్ స్కూల్‌కు అవార్డు


సాత్విక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరిత

కొత్తపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి ఉత్తమ పాఠశాలగా ఎలగందుల మోడల్ స్కూల్, ఉత్తమ విద్యార్థిగా ఎ.సాత్విక్(10వ తరగతి) ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ వి.సరిత తెలిపారు. సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ ఓపెన్ కేటగిరీలో కొత్తపల్లి మండలం ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినందుకు అవార్డు వరించింది. ఈ మేరకు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సాత్విక్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. గత ఐదేళ్లుగా ఉత్తమ పాఠశాలగా ఎంపికవుతుండటం గర్వంగా ఉందని చెప్పారు. మ్యాథ్స్ ఉపాధ్యాయులు విఠల్, రజిత, శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.